# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-09-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పర్యావరణ పరిరక్షణతోనే అభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **తెలంగాణలోని ఆదిలాబాద్‌లో రక్షణ రంగ ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నోడల్ అధికారులను నియమించింది.**

3. **పేదల వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి తెలిపారు.**

4. **ప్రముఖ సంఘసంస్కర్త, రచయిత గురజాడ అప్పారావు జయంతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తోంది.**

==========================

పర్యావరణ పరిరక్షణతోనే అభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కర్నాటకలోని బెంగళూరులో ఏర్పాటు చేసిన 'ది ఎర్త్ సెంటర్-విష్టా స్పేసెస్' భవనాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, పర్యావరణానికి నష్టం కలగకుండా పర్యావరణహిత నిర్మాణాల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. భవన నిర్మాణాల్లో సౌర విద్యుత్, నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. అమరావతిని పర్యావరణహిత నగరంగా అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి  తెలియజేస్తూ..

వాయిస్ ..29..సెకన్లు

-------------------------

తెలంగాణలోని ఆదిలాబాద్ లో రక్షణ రంగ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు సంబంధించిన పనులను వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నోడల్ అధికారులను నియమించినట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన స్పందిస్తూ, రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లేందుకు రక్షణ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖల నుంచి నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు నుంచి రెండు రోజులపాటు చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా గుండిశెట్టిపల్లి వద్ద నిర్వహించే హంద్రీనీవా జలహారతి కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే కుప్పం నియోజకవర్గంలో 289 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేస్తారు. అనంతరం కుప్పం కొత్తపేటలో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. కుప్పం రైల్వే స్టేషన్‌లో దాదర్-పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు అదనపు హాల్ట్‌ను ప్రారంభిస్తారు.

---------------------------

పేదలకు వైద్య ఖర్చులను తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా తూర్పు నాయుడుపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో 359 మంది లబ్ధిదారులకు కోటి 90 లక్షల రూపాయల విలువైన సహాయ నిధి చెక్కులను మంత్రి నిన్న అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కొండపి నియోజకవర్గంలో ఇప్పటివరకు 2 వేల 560 మందికి 19 కోట్ల 98 లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించినట్లు ఈ సందర్భంగా మంత్రి తెలియజేస్తూ...

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

మలేషియాలో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన నలుగురు యువకులను క్షేమంగా స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. బాధిత యువకుల కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని క్యాంపు కార్యాలయంలో కేంద్ర మంత్రిని నిన్న కలిసి, తమ వారిని సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. యువకులను స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు మలేషియా అధికారులతో పాటు భారత రాయబార కార్యాలయం, విదేశాంగ శాఖతో సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మూడు కోట్ల 79 లక్షల రూపాయలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి విజ్జేశ్వరం మంచినీటి పథకానికి పనులు ప్రారంభించామని మంత్రి వివరిస్తూ...

వాయిస్.. 30.. సెకన్లు

---------------------------

“దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్” అని జాతీయ సమగ్రత గురించి తెలిపిన నవయుగ వైతాళికులు, ప్రముఖ సంఘసంస్కర్త, రచయిత గురజాడ అప్పారావు జయంతి ఈరోజు. 1862 సెప్టెంబర్ 21 జన్మించిన ఆయన తన రచనల ద్వారా తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసిన గొప్ప సాహితీకారులలో ఒకరు. కన్యాశుల్కం, ముత్యాలసరాలు, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, వంటి రచనల ద్వారా సాంఘిక దురాచారాలపై రచనలు చేసిన సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు. ఆయన రచించిన “కన్యాశుల్కం” నాటకం తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానాన్ని పొందింది. గురజాడ అప్పారావు జయంతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తోంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమలలో శ్రీవేంకటేశ్వర స్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శ్రీ మలయప్ప స్వామి వారు గజ వాహనంపై భక్తులకు నిన్న దర్శనమిచ్చారు. దీనిపై మరిన్ని వివరాలను మా ఆకాశవాణి తిరుపతి జిల్లా ప్రతినిధి అందిస్తారు.

వాయిస్..25.. సెకన్లు

---------------------------

తెలంగాణలోని కరీంనగర్‌ను మెరుగైన మౌలిక సదుపాయాలతో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు కొత్త చెత్త సేకరణ రిక్షాలు, ఫాగింగ్ మిషన్లను మంత్రి నిన్న పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కరీంనగర్‌లో పారిశుద్ధ్య నిర్వహణకు మరింత ప్రాధాన్యత ఇస్తున్నామని, నగర పరిశుభ్రతే లక్ష్యంగా ప్రతి డివిజన్‌కు ఒక చెత్త సేకరణ రిక్షాను అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా మరో వారం రోజుల్లో టెండర్ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

---------------------------

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా మైభారత్ యువజన అధికారి ప్రేమ భరత్ కుమార్ సూచించారు. విజయనగరంలోని ఎస్.ఎస్.జె. జూనియర్ కళాశాలలో కేంద్ర యువజన వ్యవహారాల శాఖ మై భారత్ విజయనగరం ఆధ్వర్యంలో "మత్తు పదార్థ రహిత యువత-వికసిత సంకల్పం" కార్యక్రమం నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా యువతతో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఈరోజు వాయుగుండంగా మారే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్ఆర్ కడప, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఈరోజు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

మరోవైపు తెలంగాణలోని ఉత్తర, దక్షిణ జిల్లాల్లో ఈరోజు, రేపు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సూచించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలో రెండు కోట్ల పది లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రహదారికి రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత నిన్న భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ఊటుకూరు రోడ్డు నుంచి ఎర్రగుంట మీదుగా తిరుమల దేవరపల్లి వరకు ఈ రహదారిని నిర్మించనున్నామని చెప్పారు.

====================